## క్లుప్తంగా

### చేసిన సేవలకు గుర్తింపు


కొండబాబును సన్మానిస్తున్న నిర్వాహకులు

విజయనగరం: నగరంలో వివిధ సేవా కార్యక్రమాలు చేపడుతూ స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ హిజ్రాస్ అసోసియేషన్‌కు తగిన గుర్తింపు లభించింది. విజయవాడలో కేసీ పుల్లయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం జరిగిన ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీ సభ్యుల అవగాహన సదస్సులో విజయనగరం హెల్పింగ్ హ్యాండ్స్ హిజ్రాస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలను ప్రశంసిస్తూ, అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు దవడ కొండబాబును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పలువురు అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

### అన్నదానానికి విరాళం


ఆలయ సూపర్‌వైజర్ ఏడుకొండలకు విరాళం అందజేస్తున్న జగదీశ్వరరావు దంపతులు

విజయనగరం టౌన్: పైడితల్లి అమ్మవారి నిత్యాన్నదానానికి సంబంధించి పట్టణంలోని గెడ్డవీధికి చెందిన ఎస్.జగదీశ్వరరావు, సత్యవతి దంపతులు లక్ష రూపాయల విరాళాన్ని గురువారం స్థానిక చదురుగుడి ఆవరణలో ఆలయ సూపర్‌వైజర్ ఏడుకొండలకు అందజేశారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ, నిత్యాన్నదానంతో పాటు అమ్మవారి ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా దాతలకు ప్రత్యేక అమ్మవారి శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు ఏడిద రమణ, సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

### రక్త నిల్వలు పెంచాలి


రక్తదానం చేస్తున్న రక్తదాతలు

విజయనగరం ఫోర్ట్: రానున్న వేసవి దృష్ట్యా రక్తం నిల్వలు పెంచాల్సిన అవసరం ఉందని గాంధీబ్లడ్ డోనర్స్ క్లబ్ అధ్యక్షుడు అబ్దుల్ రవూఫ్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక రోటరీ రక్తనిధి కేంద్రంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రక్తదాన శిబిరాలు విరివిగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో పి.హరీష్, తదితరులు పాల్గొన్నారు.

### లింగాకర్షక బుట్టలతో ప్రయోజనం


లింగాకర్షణ బుట్టల ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తున్న ఏఓ నిర్మల

డెంకాడ: పంటలను నాశనం చేసే పురుగుల నివారణకు లింగాకర్షణ బుట్టలు ఎంతగానో ఉపయోగపడతాయని ఏఓ పి.నిర్మల అన్నారు. మండలంలోని చింతలవలస పరిధిలో డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా అపరాల సాగుపై అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, రసాయన ఎరువుల వల్ల ఎన్నో అనర్థాలు వస్తాయన్నారు. సేంద్రియ వ్యవసాయం వల్ల భూసారం పెరగడంతో పాటు నాణ్యమైన దిగుబడులు వస్తాయని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకుడు విజయ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

### క్షయ రోగులకు సరుకుల పంపిణీ


సరుకులు అందజేస్తున్న డాక్టర్ రవీంద్ర

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధిలోని పట్టణ ఆరోగ్యకేంద్రంలో క్షయరోగులకు పౌష్టికాహారం కిట్లు గురువారం పంపిణీ చేశారు. అరబిందో ఫార్మా ఫౌండేషన్ (హైదరాబాద్)ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అరబిందో ఫార్మా ఫౌండేషన్ క్షయ రోగులను దత్తత తీసుకుని, వారికి ప్రతినెల సరిపడా పప్పులు, నూనె, వేరుశనగ పప్పు, బెల్లం, ఖర్జూరం, బూస్ట్ అందజేస్తున్నారు. కార్యక్రమంలో డాక్టర్ బి. రవీంద్ర, టీబీ సూపర్‌వైజర్లు పైడిరాజు, వీరాస్వామి, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

# పార్టీ విజయమే ధ్యేయం

● డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి


గృహసారథుల కిట్లను ప్రదర్శిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, పార్టీ నాయకులు, తదితరులు

విజయనగరం: పార్టీ విజయమే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పిలుపునిచ్చారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సాగిస్తున్న ప్రజా సంక్షేమ పాలనను ప్రజలకు మరింత దగ్గరగా తీసుకెళ్లాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందన్నారు. పార్టీ జోనల్ ఇన్‌చార్జ్‌లు, పార్టీ కార్పొరేటర్లతో గురువారం సమావేశం నిర్వహించారు. ముందుగా గృహసారథులు, సచివాలయ కన్వీనర్లకు గృహసారథుల కిట్‌లను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్క కార్పొరేటర్ జోనల్ ఇన్‌చార్జ్‌లతో కలసి వార్డుల్లోకి వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకోవాలన్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేసి రానున్న ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. అదే సమయంలో ప్రతిపక్షాల ఆరోపణలను తిప్పికొట్టాలన్నారు. 2014లో అధికారం చేపట్టిన చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడం వల్లే 2019 ఓడిపోయారన్నారు. 2019 ఎన్నికల్లో అధికారం చేపట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో దాదాపు 98 శాతం అమలు చేశారని చెప్పారు. సంక్షేమ పథకాలు మంజూరు చేయడంతో పాటు ప్రజా సమస్యలను పరిష్కరించడంతో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విశేష స్పందన వస్తోందన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థ వల్ల అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ జేసీఎస్ కన్వీనర్లు, పార్టీ జోనల్ ఇన్‌చార్జ్‌లు, ఆయా డివిజన్ కార్పొరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

## షావలీ బాబాకు చాదర్ సమర్పణ


చాదర్ సమర్పిస్తున్న మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి

విజయనగరం: కోట జంక్షన్ వద్ద గల హజరత్ డెంఖే షావలి బాబా దర్గాలో 306వ ఉరుసు మహోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు మంత్రి బొత్స సత్యనారాయణ సతీమణి, విజయనగరం లోక్‌సభ మాజీ సభ్యురాలు డాక్టర్ బొత్స ఝాన్సీలక్ష్మి దర్గాను సందర్శించగా.. దర్గా ఖాదీమ్ బహదూర్ (చోటా), ముస్లిం పెద్దలు సాదర స్వాగతం పలికారు.ఈ సందర్భంగా విశ్వశాంతి కోసం ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. అనంతరం మాజీ ఎంపీ ఝాన్సీలక్ష్మి బాబాకి చాదర్ సమర్పించారు. అనంతరం జరిగిన అన్న సమారాధనలో సీతం విద్యాసంస్థల డైరెక్టర్ మజ్జి శశిభూషణరావు, బొత్స కుటుంబీకులు, అభిమానులు, మైనార్టీ పెద్దలు పాల్గొన్నారు.

## మూడు గ్రామాలు ఖాళీ


ముడసర్లపేటలో జేసీబీతో కూల్చివేస్తున్న నిర్వాసితుని ఇల్లు

భోగాపురం: విమానాశ్రయ నిర్మాణంలో భాగంగా ముడసర్లపేట, రెల్లిపేట, బొల్లింకలపాలెం గ్రామాలకు చెందిన నిర్వాసితులు తమ గృహాలను ఖాళీ చేశారు. పోలిపల్లి, గూడెపువలస రెవెన్యూ పరిధిలో ప్రభుత్వం సకల సదుపాయాలతో నిర్మించిన ఆర్‌అండ్‌ఆర్ కాలనీల్లో ఈ మూడు గ్రామాలకు చెందిన నిర్వాసితులు నిర్మాణాలను పూర్తి చేసుకుని గృహప్రవేశాలు చేశారు. దీంతో రెవెన్యూ అధికారులు మూడు గ్రామాల్లో ఉన్నటువంటి నిర్వాసిత గృహాలతో పాటు పాఠశాలలను గురువారం జేసీబీలతో కూల్చి వేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ కోరాడ శ్రీనివాసరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి


కొండవెలగాడలో నూతన బస్సులను ప్రారంభించిన ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ గదల బంగారమ్మ, తదితరులు

● ఏపీఎస్ ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ గదల బంగారమ్మ
● సింహాచలం నుంచి విజయనగరానికి బస్ సర్వీసులు ప్రారంభం

నెల్లిమర్ల రూరల్: ఏపీఎస్ ఆర్టీసీ సేవలను భక్తులు సద్వినియోగపరుచుకోవాలని ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ గదల బంగారమ్మ సూచించారు. మండలంలోని కొండవెలగాడలో సింహాచలం నుంచి విజయనగరం మధ్య నడిచే రెండు సర్వీసులను గురువారం ఆమె లాంఛనంగా ప్రారంభించారు. నూతన బస్సులకు విశాఖ జిల్లా ప్రజా రవాణాధికారి అప్పలరాజుతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గదల బంగారమ్మ మాట్లాడుతూ, ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా సర్వీసులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రముఖ పుణ్యక్షేత్రాలకు ఆర్టీసీ బస్సులను విరివిగా ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. సింహాచలం కొండపై నుంచి విజయనగరానికి ఉదయం 10.30 గంటలకు ఒక బస్సు, 11 గంటలకు మరో బస్సు బయలుదేరుతుందని తెలిపారు. అలాగే ఈ నెల 18 నుంచి రామతీర్థంలో రెండు రోజుల పాటు జరగనున్న శివరాత్రి ఉత్సవాలకు సంబంధించి ప్రత్యేక బస్సుల ఏర్పాటుపై ఆర్టీసీ ఉన్నతాధికారులతో మాట్లాడినట్లు చెప్పారు. కార్యక్రమంలో సింహాచలం డిపో మేనేజర్ రాజశేఖర్, సీఎస్ఐ ప్రవీణ్‌కుమార్, నాయకులు కర్రోతు వెంకటరమణ, వాల్లే అప్పలనాయుడు, సత్యారావు, ఆదినారాయణ, బాలి శ్రీనివాసరావు, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

## రూ.1.50 కోట్లతో రోడ్డు మరమ్మతులు


అరకు-విశాఖ రోడ్డులో రంగాపురం వద్ద చేపడుతున్న మరమ్మతులు

లక్కవరపుకోట: అరకు-విశాఖపట్నం జాతీయ రహదారిలో ఎల్.కోట మండలం గోల్డుస్టార్ జంక్షన్ నుంచి ఎస్.కోట మండలం బొడ్డవర వరకు మరమ్మతుల పనులు చురుగ్గా సాగుతున్నాయి. 22 కిలోమీటర్ల మేర రోడ్డు మరమ్మతులకు ప్రభుత్వం రూ.1.50 కోట్లు మంజూరు చేసిందని నేషనల్ హైవే డీఈ నర్సింహరావు గురువారం తెలిపారు.

## గత ప్రభుత్వాల కంటే మిన్నగా సహకారం..

● నాయీ బ్రాహ్మణుల సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దుర్గారావు


మాట్లాడుతున్న నాయీ బ్రాహ్మణుల సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దుర్గారావు

విజయనగరం పూల్‌బాగ్: గత ప్రభుత్వాలకంటే మిన్నగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం నాయీ బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి చేస్తోందని ఆంధ్రప్రదేశ్ నాయీ బ్రాహ్మణ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు టీవీ దుర్గారావు అన్నారు. గురువారం స్థానిక ప్రజాగ్రంథాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ, సెలూన్‌లకు 150 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇచ్చేందుకు జీఓ 15, నాయీ బ్రాహ్మణులను కులం పేరుతో అవమానించకుండా జీఓ 50, ఎండోమెంట్ పరిధిలో ఉన్న 610 దేవాలయ పాలక కమిటీలలో ఒకరికి అవకాశం కల్పించడం చారిత్రక నిర్ణయాలని కొనియాడారు. అదేవిధంగా చేదోడు, చేయూత, అమ్మఒడి, జగనన్న ఇంటి స్థలాలు, తదిత పథకాలు అందరికీ అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో పట్నాన సిమ్మయ్య, ఆలమూరు శ్రీను, కాళ్ళకూరి అసేన నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## నియామకపత్రం అందజేత


ఆయాకు నియామకపత్రం అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

గుర్ల: మండలంలోని భూపాలపురం అంగన్‌వాడీ కేంద్రానికి హెల్పర్‌గా(ఆయా) నియమితులైన లెంక సుజాతకు జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు విజయనగరంలోని తన క్యాంపు ఆఫీస్‌లో గురువారం నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధ్యతగా విధులు నిర్వర్తించాలని సూచించారు. జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ● రూపురేఖలు మారాయి..

జిల్లా కేంద్రంలోని పలు రహదారుల రూపురేఖలు మారాయి. ఒకప్పుడు అధ్వానంగా ఉన్న రోడ్లను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దింది. డివైడర్లు వేయడంతో పాటు సెంటర్ లైటింగ్‌తో రహదారులను ఆకర్షణీయంగా మార్చారు. ఇందులో భాగంగా రైల్వేస్టేషన్ రోడ్డును సెంట్రల్ లైటింగ్‌తో అందంగా ముస్తాబు చేయడంపై వాహనదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం


ఒకప్పటి రైల్వేస్టేషన్ రోడ్డు


వైఎస్సార్‌సీపీ హయాంలో అభివృద్ధి చెందిన రోడ్డు

## రోడ్డు పనుల్లో నాణ్యత పరిశీలన


యాతపాలెం వద్ద రోడ్డు పనుల్లో నాణ్యతను పరిశీలిస్తున్న అధికారులు

జామి: మండలంలోని అలమండ సంత నుంచి భీమసింగి గ్రామం వరకు చేపడుతున్న బీటీరోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతను క్వాలిటీ కంట్రోల్ డీఈ వాణి ఆధ్వర్యంలో సిబ్బంది గురువారం పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలపై సంతృప్తి వ్యక్తం చేశారు.ఆర్‌అండ్‌బి డీఈ శ్రీనివాస్, జేఈ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న లేఅవుట్‌లో బోరు ఏర్పాటు

వేపాడ: మండలంలోని బల్లంకి గ్రామంలో జగనన్న లేఅవుట్‌లో తాగునీరు, ఇళ్ల నిర్మాణాల కోసం గురు వారం బోరు తవ్వకాలు చేశారు. ఈ పనులకు ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు భూమిపూజ చేశారు. మండల ప్రజా పరిషత్ నిధులు రూ.1.20 లక్షలతో బోరు తవ్వించి, మోటారు ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ దేవి తెలిపారు. వైస్ ఎంపీపీ అడపా ఈశ్వరరావు, గ్రామపెద్దలు సూకిరెడ్డి తాతారావు, బొడ్డు శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ జేఎస్‌సీ మండల కన్వీనర్ భోజంకి శ్రీను పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయాన్ని అలవర్చుకోవాలి


ఒమ్మిలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఏఓ పూర్ణిమ, తదితరులు

నెల్లిమర్ల రూరల్: రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని అలవర్చుకోవాలని ఏఓ పూర్ణిమ సూచించారు. మండలంలోని ఒమ్మి గ్రామంలో సేంద్రియ వ్యవసాయ సాగుపై గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో భాగంగా నవధాన్యాలు సాగు చేసి భూమిలో జీవ వైవిధ్యం పెంచుకోవాలని సూచించారు. భూమిలో కార్బన్ శాతాన్ని పెంచాల్సిన అవసరముందని, రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకాన్ని తగ్గించాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# దివ్యాంగుల్లో మనోధైర్యం నింపాలి


వీల్‌చైర్లలో ఆసీనులైన దివ్యాంగులు

● డిప్యూటీ మేయర్ శ్రావణి

విజయనగరం: దివ్యాంగులు, బుద్ధిమాంద్యంతో బాధపడే వారిలో మనోధైర్యం నింపే ప్రయత్నం చేయాలని నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. నగరంలోని కల్యాణానంద భారతి నగర కార్పొరేషన్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న భవిత కేంద్రంలో బుద్ధిమాంద్యం గల చిన్నారులకు బుధవారం ఉపకరణాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, భగవంతుడు దివ్యాంగులకే అత్యున్నత ప్రతిభాపాటవాలు ప్రసాదిస్తాడని, అందుకే వారు అందరికీ స్ఫూర్తిగా నిలుస్తారన్నారు. వైకల్యం అనేది విజయ సాధనకు అడ్డు కాదని.. కృషి, పట్టుదల ఉంటే ఎంతటి ఎంతటి విజయాన్నైనా సాధించవచ్చన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, సంక్షేమ పథకాలను దివ్యాంగులు వినియోగించుకునేలా తల్లిదండ్రులు కృషి చేయాలని సూచించారు. భవిత కేంద్రానికి సంబంధించి శాశ్వత భవన నిర్మాణ విషయాన్ని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి దృష్టికి తీసుకువెళ్తానన్నారు. మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ ఎస్‌వీవీ రాజేష్, ఐదో డివిజన్ కార్పొరేటర్ గాదం మురళి, మండల విద్యాశాఖాధికారి జి. విజయలక్ష్మి సమగ్ర శిక్ష, విద్యా శాఖ ద్వారా దివ్యాంగ విద్యార్థులకు అందుతున్న సేవలను వివరించారు. అనంతరం సుమారు రెండు లక్షల రూపాయల విలువచేసే రెండు సీపీ చైర్లు, నాలుగు వీల్ చైర్లు, 16 వినికిడి యంత్రాలు దివ్యాంగులకు అందజేశారు. కార్యక్రమంలో సహిత విద్య జిల్లా సమన్వయకర్త ఎస్.సూర్యారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్. అప్పారావు, సహిత విద్య ఉపాధ్యాయుడు ఎన్. బంగారునాయుడు, ఎస్. రాజేశ్వరరావు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# పొగాకు ఉత్పత్తులకు దూరం


వెల్‌స్కోప్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ పద్మలీల, డాక్టర్ అప్పలనాయుడు

విజయనగరం ఫోర్ట్: పొగాకు ఉత్పత్తులకు ప్రజలు దూరంగా ఉండడం ద్వారా క్యాన్సర్ బారిన పడకుండా ఉండవచ్చునని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. పద్మలీల, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సంబంగి అప్పలనాయుడు సూచించారు. గురువారం స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలోని దంత విభాగంలో వెల్‌స్కోప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జగనన్న చిరునవ్వు కార్యక్రమంలో భాగంగా రూ.8 లక్షల విలువైన పరికరాన్ని ప్రభుత్వం అందించిందని తెలిపారు. క్యాన్సర్‌ను ఎంత తొందరగా గుర్తిస్తే, అంత త్వరగా నయం చేయవచ్చన్నారు. కార్యక్రమంలో ఆర్ఎంఓ లక్ష్మణరావు, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎ. కామేష్, పూర్ణిమ కుమారి, తదితరులు పాల్గొన్నారు.

# తుఫాన్ రక్షిత భవనాల పరిశీలన


తోటపల్లిలోని బహుళ ప్రయోజన తుఫాన్ రక్షిత భవనాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర విపత్తుల శాఖాధికారి నాగరాజు

భోగాపురం: మండలంలోని చినకొండ్రాజుపాలెం, తోటపల్లి గ్రామాల్లో ప్రభుత్వం నిర్మించిన బహుళ ప్రయోజక తుఫాన్ రక్షిత భవనాలను రాష్ట్ర విపత్తుల శాఖాధికారి టి.నాగరాజు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వరల్డ్ బ్యాంక్ నిధులతో రాష్ట్రంలో 219 బహుళ ప్రయోజన భవనాలను నిర్మించినట్లు చెప్పారు. ప్రభుత్వం ఈ భవనాలకు కావాల్సిన పరికరాలను సరఫరా చేయాడంతో పాటు మెయింటినెన్స్ కోసం ఒక్కో భవనానికి రూ. ఐదు లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. బ్యాంక్‌ల్లో డిపాజిట్ చేసిన ఈ నగదుపై వచ్చిన వడ్డీతో భవనాల నిర్వహణ చేపడతామన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి బి.పద్మావతి, డీటీ శ్రీనివాసరావు, ఏపీఎం రమణ, దుక్క అప్పన్న, సిబ్బంది పాల్గొన్నారు.

# కంప్యూటర్ ప్రొగ్రామింగ్ కోడింగ్‌తో ఉద్యోగావకాశాలు



ముఖ్య అతిథిని సత్కరిస్తున్న డైరెక్టర్ శశిభూషణరావు

విజయనగరం అర్బన్: కంప్యూటర్ ప్రొగ్రామింగ్ కోడింగ్‌లో కొత్త పోకడలను అర్థం చేసుకోవడం ద్వారా ఉద్యోగావకాశాలను మెరుగుపరచుకోవచ్చని హైదరాబాద్‌కు చెందిన బ్రెయిన్ విజన్ సంస్థ సీఈఓ గణేష్‌నాగ్ అన్నారు. స్థానిక సీతం ఇంజినీరింగ్ కళాశాలలో 'టెక్నికల్ ఇంటరాక్టివ్ సెషన్ విత్ బ్రెయిన్ విజన్' అంశంపై గురువారం జరిగిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రానున్న రోజుల్లో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, డేటా సైన్స్, మాక్రో ఇన్ఫర్మేషన్ అనాలిసిస్ రంగాల్లో విప్లవాత్మక మార్పులు రానున్నాయని, ఆ అవకాశాలను సద్వినియోగం చేసుకునేందుకు విద్యార్థులు సన్నద్ధం కావాలని సూచించారు. సీతం, బ్రెయిన్ విజన్ రాబోయే రోజుల్లో సమిష్టిగా హ్యాకథాన్, ప్రాజెక్ట్ ఎక్స్‌పో చేపడతాయని, అలాగే సీతం విద్యార్థులతో 'స్మార్ట్ విజయనగరం'పై ప్రాజెక్ట్‌ను అభివృద్ధి చేయడానికి ప్రణాళికలను రూపొందించినట్లు తెలిపారు. ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్నప్పుడే కొత్త అంశాలను నేర్చుకునేలా నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సీతం కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు పిలుపునిచ్చారు. అనంతరం ముఖ్య అతిథిని కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించారు. సదస్సులో కంప్యూటర్ సైన్స్ విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.